7

సాక్షి
మంచిర్యాల

శనివారం । 18 । మే । 2024



అధికారులు కావలెను
వ్యవసాయ శాఖలో అధికారుల కొరత నెలకొంది. అధికారుల నస్పెన్షన్లు, డిప్యూటేషన్లతో కొరత ఏర్పడింది. దీంతో ఒక్కరికే నాలుగు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది. 8లో▸



కాల్వలో ట్రాలీ బోల్తా 8లో▸
దండేపల్లి సమీపంలోని కడెం డిస్ట్రిబ్యూటరీ-28 కాలువలో టాటా ఏస్ ట్రాలీ వాహనం బోల్తాపడి 16మంది కూలీలు గాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /26.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మరమ్మత్తు పనులు నాణ్యతతో చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి మున్సిపాలిటీలోని నెంబర్-2 ఇంక్‌లైన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి మోతుకుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చంద్రవెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈవో యాదయ్యతో కలిసి పరిశీలించారు. నాసిరకం వస్తువులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లలో పనులు పూర్తి చేసి నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేవాలని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, ఈడబ్ల్యూఎస్ ఏఈ వినయ్‌కుమార్, సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, చౌదరి పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



నెన్నెల సబ్‌స్టేషన్‌లో శ్రావణ్‌కుమార్

నెన్నెల: వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం నెన్నెల, ఆవుడం, జన్కాపూర్ సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేసి విద్యుత్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కన్నెపల్లి ఫీడర్ నెన్నెల నుంచి ఆవుడం వరకు 33కేవీ లైన్ మంజూరు కోసం రూ.1.50కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. విద్యుత్ లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరి చేయాలని అన్నారు. గ్రామాల్లో విద్యుత్ అంతరాయంపై మండల ఏఈలు వెంటనే స్పందించాలని ఆదేశించారు. బెల్లంపల్లి రూరల్ ఏడీ రాంచందర్, నెన్నెల విద్యుత్ ఏఈ మల్లయ్య పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కోటపల్లి కొనుగోలు కేంద్రంలో మోతీలాల్

కోటపల్లి: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కోటపల్లి ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అన్నారు. మిల్లర్లు కూడా ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

సామాన్యులదే !



పట్టుబడిన నగదు తిరిగి ఇచ్చేలా ధ్రువీకరణ ఇస్తున్న అధికారులు(ఫైల్)

- ఎన్నికల తనిఖీల్లో రూ.93.79లక్షలు సీజ్
- పట్టుబడినదంతా తిరిగి ఇచ్చేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సామాన్యుల సొమ్మే పట్టుబడింది. ఎన్నికల్లో పారదర్శకత కోసం అక్రమ నగదు తరలింపు అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో అక్రమంగా డబ్బు తరలించింది ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం. జిల్లాలో గత ఏప్రిల్ నెలలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి పట్టణాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారులు, ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాణహిత తీరం వద్ద, జిల్లాల సరిహద్దుల్లోనూ తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50వేల కంటే అధికంగా ఉన్న వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోలింగ్‌కు సమయం ఎక్కువగా ఉందని, మధ్యలో కొన్ని రోజులు తాత్కాలికంగా నిలిపివేయగా, మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక తనిఖీలు కఠినతరం చేశారు. ఈ తనిఖీల్లో చాలావరకు సామాన్య ప్రజల డబ్బులే పట్టుబడ్డాయి. వ్యాపారాలు, శుభకార్యాలు, రైతులు, చిరు వ్యాపారుల వద్ద డబ్బులు ఉన్నట్లు గుర్తిస్తే సీజ్ చేశారు.

ఆధారాలిస్తే తిరిగిచ్చారు

జిల్లాలోని మూడు ప్రధాన నియోజకవర్గాల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఈ నెల 13న పోలింగ్ పూర్తయ్యే వరకు మొత్తం 83 కేసుల్లో రూ.93.79లక్షలు పట్టుబడ్డాయి. ఈ మొత్తం కూడా సాధారణ ప్రజలవనే గుర్తించారు. ఇందులో రాజకీయ పార్టీలు, నాయకులకు చెందిన డబ్బులేవీ పట్టుబడలేదు. ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేసేందుకు, ఓటర్లకు కానుకల కింద ఇచ్చేవి ఏవీ కూడా ఈ చెక్‌పోస్టుల్లో పట్టుబడలేదు. వివిధ అవసరాల కోసం డబ్బును వెంట తీసుకెళ్లే వారికే తనిఖీలతో ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లాలో నోడల్ ఆఫీసర్‌గా జిల్లా సహకార శాఖ అధికారి, సభ్యులుగా ఖజానా అధికారి, జెడ్పీ సీఈవోలతో కూడిన కమిటీ.. పట్టుబడిన సొమ్మును కేసులు నమోదు చేసి, సరైన ఆధారాలు చూపిస్తే తిరిగి ఇచ్చారు. సీజ్ చేసిన మొత్తాన్ని ఖజానా శాఖకు జమ చేసి, ఆధారాలు చూపిస్తే తిరిగి అందజేశారు. జిల్లాలో పూర్తిగా సామాన్యులకు చెందిన డబ్బులే ఉండడంతో వందశాతం పట్టుబడిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేసినట్లు అధికారులు వెల్లడించారు. రూ.పది లక్షలకు పైగా పట్టుబడిన వాటిని ఆదాయ శాఖ అధికారులకు అప్పగించగా, వాటిపై విచారణ జరుగుతోంది.

నియోజకవర్గం	నమోదైన కేసులు	పట్టుబడి, తిరిగిచ్చిన మొత్తం(రూ.లలో)
మంచిర్యాల	21	19,05,020
చెన్నూరు	10	12,96,750
బెల్లంపల్లి	52	61,77,722
మొత్తం	83	93,79,492



మూత'బడుల' పునరుద్ధరణ?



మూతబడిన కొత్తకొమ్ముగూడెం పాఠశాల

- వివరాల సేకరణలో విద్యాశాఖ

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు లేరంటూ మూసివేసిన ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. 2024 విద్యాసంవత్సరం పునఃప్రారంభంలో బడులు తెరిచేలా చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులు ఉండి మూతపడిన స్కూళ్లపై ఆరా తీస్తోంది. ఆయా గ్రామాల్లో పిల్లలు ఉన్నారా..? ఎక్కడి పాఠశాలల్లో చదువుతున్నారు..? పాఠశాలలు తెరిచే అవకాశాలు ఎంతమేర ఉన్నాయి..? అనే విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. సీఆర్పీలు, గ్రామ కార్యదర్శులు, మండల విద్యాశాఖ అధికారులు స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంతమంది పిల్లలున్నా పాఠశాలలు నడపాలని, ఇందుకు అవసరమైన ఉపాధ్యాయులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రతీ పంచాయతీకి సర్కారు పాఠశాల ఉండాలనే నిర్ణయంతో మూసేసిన బడులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల లెక్కలు తీసే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

తెరుచుకునేవి ఎన్నో..

విద్యార్థులు లేకపోవడంతో 31 పాఠశాలలు(సున్న పాఠశాలలు) తాత్కాలికంగా మూతపడ్డాయి. వీటిలో 19 పాఠశాలల్లో టీచర్లు ఉన్నా విద్యార్థులు లేరు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఇతర స్కూళ్లకు సర్దుబాటు చేశారు. దీంతో సున్న పాఠశాలల భవనాలు కళావిహీనంగా మారాయి. కొన్నిచోట్ల ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లతో నిండిపోగా మరికొన్ని పాఠశాలల భవనాలు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పాఠశాలలు మూతపడినా టీచర్లు మాత్రం కొనసాగుతూ వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు పాఠశాలలకు పిల్లలు వెళ్లిపోయినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలలు మూతపడడం వల్ల విద్యార్థులు కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. దూరం, ఆర్థిక భారంగా మారుతోంది. కిలోమీటరు లోపు ప్రైమరీ, మూడు కిలోమీటర్ల లోపు అప్పర్ ప్రైమరీ, ఐదు కిలోమీటర్లలోపు హైస్కూల్ ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఇందులో భాగంగా గతంలో పాఠశాలలు తెరిచి ఉపాధ్యాయులను కేటాయించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితుల వల్ల సర్కారు బడుల్లో పిల్లల సంఖ్య లేకపోవడంతో మూసివేశారు.

టీచర్లు ఉన్నా..

టీచర్లు ఉన్నా విద్యార్థులు లేక 31పాఠశాలలు ఏళ్ల తరబడిగా మూతపడ్డాయి. 19 బడుల్లో విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు కేటాయించారు. వీటిలో బెల్లంపల్లి మండలం పీఎస్ సుబ్బారావుపల్లి, పీఎస్ అశోక్‌నగర్ ఉర్దూ, పీఎస్ గోండుగూడలో టీచర్ ఉన్నారు.

- ఎంపీపీఎస్ దుగ్నేపల్లి(టీచర్ సస్పెండ్ అయ్యారు). చెన్నూర్ వస్తాద్‌పల్లి ఎంపీపీఎస్, ఎంపీపీఎస్ ముత్తారావుపల్లి, ఎంపీపీఎస్ సుబ్బారాంపల్లి, ఎంపీపీఎస్ బొక్కలగూడ, దండేపల్లి మండలం ఎంపీపీఎస్ నేత కానీగూడ, హాజీపూర్ ఎంపీపీఎస్ గుడిపేట్ పోలీస్‌క్యాంపు, ఎంపీపీఎస్ వెంపల్లిలో ఉపాధ్యాయులు ఉన్నారు.
- జైపూర్ ఎంపీపీఎస్ గుత్తేదారుపల్లి సింగరేణి ఓసీపీలో ఊరు కనుమరుగు కాగా పిల్లలు లేకపోవడంతో ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు సర్దుబాటు చేశారు. జన్నారం మండలంలో ఎంపీపీఎస్ చర్లపల్లి, ఎంపీపీఎస్ పాపమ్మగూడ, ఎంపీపీఎస్ శ్రీలంకకాలనీ, ఎంపీపీఎస్ మురిమడుగు, రైండ్ల గూడ, లక్సెట్టిపేట ఎంపీయూపీఎస్ కొత్తకొమ్ముగూడెం, ఎంపీపీఎస్ మోదేల, నెన్నెల మండలం ఎంపీపీఎస్ బొప్పారంలో పిల్లలు లేకపోయినా టీచర్లు ఉండడంతో ఇతర పాఠశాలకు కేటాయించారు.
- కొండపల్లిలో స్కూల్ భవనం లేదు. అక్కడ 20 మంది పిల్లలు కర్ణమామిడి గ్రామంలోని సర్కారు పాఠశాలకు వెళ్తున్నట్లు తెలిసింది. పిల్లలున్నా భవనం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల ప్రారంభిస్తేనే భవనంతోపాటు ఉపాధ్యాయ పోస్టు మంజూరయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఉచిత విద్యతోపాటు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతోపాటు ఇతర సౌకర్యాలు ఉండి మూతపడిన ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరణకు ప్రజలు తమవంతు సహకరించాల్సి ఉంటుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే మూసివేసిన 7, 8 పాఠశాలలు ముందుగా తెరుచుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

చల్లబడ్డ వాతావరణం

- గత నాలుగు రోజులుగా వర్షాలు
- జిల్లాలో 12.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నాలుగు రోజులుగా వాతావరణం చల్లబడింది. గురువారం నుంచి శుక్రవారం వరకు 12.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులు కమ్ముకొని ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. ఈ వర్షాలు సాధారణ ప్రజలకు ఊరటనిస్తుండగా.. ధాన్యం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యంతోపాటు ఇంకా కోత దశలో ఉన్న వరిపంట, మామిడి రైతులను నష్టపరుస్తున్నాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల పరిధిలో ధాన్యం సేకరణ 70శాతం పూర్తి కాగా మిగతా మండలాల్లో 50శాతం పూర్తి కాలేదు. ధాన్యం సేకరణ వేగవంతంగా లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అవస్థలు పడుతున్నారు. మొన్నటి వరకు ఎండలో తేమ శాతం 17లోపే రాగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం, వాతావరణం చల్లబడడంతో తేమ శాతం ఎక్కువగా వస్తుందని తూకం వేయడం లేదని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం వస్తే ధాన్యం కొట్టుకుపోతుందని, ఆలస్యం చేయకుండా ధాన్యం సేకరించాలని కోరుతున్నారు.

వర్షపాతం

తాండూర్ మండలంలో 46.4 మిల్లీమీటర్లు, జన్నారంలో 32.7, కోటపల్లిలో 17.8, హాజీపూర్‌లో 18.7, నస్పూర్‌లో 14.2, మంచిర్యాలలో 13.4, లక్సెట్టిపేటలో 12, దండేపల్లిలో 7.5, కాసిపేటలో 8.1, భీమినిలో 4.1, కన్నెపెల్లిలో 7, వేమనపల్లిలో 3.9, నెన్నెలలో 4, బెల్లంపల్లిలో 3.9, మందమర్రిలో 7.6, జైపూర్‌లో 12.2, భీమారంలో 8.8, చెన్నూర్ మండలంలో 8.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పచ్చిరొట్ట విత్తనాలేవి..!

- ఎదురుచూస్తున్న రైతులు
- ధరలు, సబ్సిడీ ఖరారు

బెల్లంపల్లి: ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. సేంద్రియ ఎరువుల మాదిరిగానే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు, జనుము, పిల్లిపెసర సాగు చేయడం వల్ల పొలాల్లో భూసారం వృద్ధి చెంది సాగు చేసిన పంట అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అంతటి ప్రాధాన్యత కలిగిన విత్తనాల కోసం రైతులు ఆతృత పడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగవుతాయి. వరికి సత్తువ ఇవ్వడానికి పచ్చిరొట్ట ఎరువులు ఎంతగానో ఉపయోగపడుతాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి 1,61,958 ఎకరాల్లో సాగయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం 5,100 క్వింటాళ్ల జీలుగు, 1,145 క్వింటాళ్ల జనుము విత్తనాలు అవసరమని ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర వ్యవసాయ శాఖకు పంపించినట్లు తెలుస్తోంది. దండేపల్లి, లక్సెట్టిపేట, భీమారం, జైపూర్ మండలాలకు విత్తనాలు చేరుకోగా మిగతా మండలాలకు రవాణా కావాల్సి ఉంది. మరో వారం రోజుల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాలకు పచ్చిరొట్ట విత్తనాలు చేరుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. జీలుగు, పిల్లిపెసర, జనుము విత్తనాలు రైతాంగానికి అందించడానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ జూన్ 6వరకు అమలులో ఉంటుంది. అప్పటివరకు వేచి ఉండం వల్ల రైతులకు విత్తనాలు అందించడం కష్టతరమవుతుందని భావించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగియడంతోపాటు రుతుపవనాల రాకకు రోజులు సమీపిస్తుండడంతో విత్తనాల ధరను వ్యవసాయ శాఖ ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో విత్తనాల ధర ఖరారుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక్కో విత్తనం ధర ఖరారు చేసి అందులో రైతు వాటా, ప్రభుత్వ సబ్సిడీ ఎంత అనేది నిర్ధారించింది. జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలకు క్వింటాల్ లెక్కన రాయితీ వర్తింపజేసింది. ధర నిర్ణయంతో విత్తనాల సరఫరాకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట(ఫైల్)

విత్తనాల ధర, సబ్సిడీ(క్వింటాల్ చొప్పున)

విత్తనం	మొత్తం ఖరీదు	రైతు వాటాధనం	ప్రభుత్వ సబ్సిడీ
పిల్లి పెసర	13,550	5,420	8,130
జీలుగు	9,300	3,720	5,580
జనుము	9,050	3,620	5,430

ట్రాన్స్‌పోర్టులో ఉన్నాయి



పచ్చిరొట్ట ఎరువుల కోసం వ్యవసాయ శాఖకు ఇండెంట్ పంపించాం. రోజువారీగా అప్‌డేట్ అడిగి తెలుసుకుంటున్నాం. విత్తనాలు బిహార్ రాష్ట్రం నుంచి రావాల్సి ఉంది. ఆయా రకాల విత్తనాలను ట్రాన్స్‌పోర్టులో వేశారు. ప్రస్తుతం నాలుగు మండలాలకు విత్తనాలు చేరుకున్నాయి. త్వరలోనే విత్తనాలు వస్తాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఎల్తూరి సురేఖ, ఇంచార్జీ డీఏఓ

పాఠశాలలు సిద్ధంగా ఉండాలి

- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభంలోగా సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో పాఠశాలల అభివృద్ధి, ధరణి, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్, బాలికల ప్రత్యేక మూత్రశాలల పనులు, మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. జూన్ 12లోగా అభివృద్ధి పనులు, పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధరణిలో పెండింగ్ దరఖాస్తులను ఈ నెల చివరి వరకు పూర్తి చేసే విధంగా మంచిర్యాల ఆర్డీవో రాములు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ప్రతీరోజు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, బెల్లంపల్లి, మంచిర్యాల ఆర్డీవోలు హరికృష్ణ, రాములు, డీఈవో యాదయ్య, పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్ పాల్గొన్నారు.



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, అధికారులు

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ బి.సంతోష్
- కొనుగోలు కేంద్రాల సందర్శన

మందమర్రిరూరల్/బెల్లంపల్లిరూరల్/నెన్నెల: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం ఆయన మందమర్రి మండలం ఆరంగపల్లి, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి, చాకేపల్లి, నెన్నెల మండలం జోగాపూర్, చిత్తాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, జిల్లా ఇంచార్జీ డీఎస్‌వో, బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, మిల్లులకు ధాన్యాన్ని త్వరగా చేరవేయాలని అన్నారు. ధాన్యంలో అధిక తేమ శాతం లేకుండా రైతులు ఆరబెట్టాలని తెలిపారు. లారీల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరారు. దీంతో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో బెల్లంపల్లి, నెన్నెల తహసీల్దార్లు కేవై.ప్రసాద్, రమేష్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పాల్గొన్న అధికారులు

జూన్ నాటికే యూనిఫాంలు పూర్తి చేయాలి

కాసిపేట: విద్యార్థుల యూనిఫాంలు కుట్టడం జూన్ ప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామ పంచాయతీలో మహిళ శక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య, డీఆర్‌డీఏ పీడీ కిషన్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో మహేందర్, ఏపీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలపై వినతి

సోమగూడెంలో సమస్యలపై కలెక్టర్‌కు స్థానిక నాయకులు విన్నవించారు. ఏడాదిగా రేషన్ డీలర్ లేక ఇబ్బందులు పడుతున్నామని, కూడళ్లలో హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని, సింగరేణి కాలనీలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని నాయకులు కుక్క రాంచందర్, ఉస్కెమల్ల వివేక్, భైరగోని సిద్ధయ్య, రాయనర్సు, సదానందం తెలిపారు.

అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రాంగణంలో శుక్రవారం అధిక సాంద్రత పత్తి సాగుపై వర్క్‌షాప్ నిర్వహించారు. పంట సాగు నిర్వహణ, విధి విధానాలు, దిగుబడులపై అవగాహన కల్పించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ మాట్లాడుతూ వానకాలంలో ఈసారి జిల్లాలో 400 ఎకరాల్లో అధిక సాంద్రతతో పత్తి సాగు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతేడాది 157.5 ఎకరాల్లో సాగు చేయగా అధిక దిగుబడి వచ్చి రైతులకు ప్రయోజనం కలిగిందని వివరించారు. నేల రకాలు, విత్తన మోతాదు, విత్తే దూరం, మొక్కల సంఖ్య, పోషకాల యాజమాన్యం, కలుపు తీత, చీడపీడల యాజమాన్య పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా ఇంచార్జీ వ్యవసాయ అధికారి ఎల్తూరి సురేఖ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన మేడి నర్సయ్య, మేడి శ్రీనివాస్‌పై భూతగాదా విషయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ భన్సీలాల్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కార్మెల్ పాఠశాల సమీపంలో 283 సర్వే నంబర్‌లో 2.20 ఎకరాల భూతగాదా విషయంలో నర్సయ్య, శ్రీనివాస్ అక్రమంగా చొరబడి భూయజమాని కాంపెల్లి అంజయ్యపై దాడి చేశారు. కులం పేరుతో దూషించారు. దీంతో అంజయ్య ఫిర్యాదు మేరకు నర్సయ్య, శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌లో చోరీకి యత్నం

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల లిఫ్ట్ ఇరిగేషన్‌లో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లోని మోటార్లు, స్టార్టర్, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను దొంగిలించడానికి వాటికి నిప్పు పెట్టారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్‌లో మంటలను గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లగా దొంగలు పారిపోయారు. అప్పటికే లిఫ్ట్ లోపలి మోటార్లు, స్టార్టర్ మంటల్లో కాలుతుండగా ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి



లక్సెట్టిపేట: మృతి చెందిన గేదెలు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నెల్కి రామయ్యకు చెందిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైర్‌ను తాకగా ప్రమాదవశాత్తు షాక్‌తో రెండు గేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కన్నెపల్లిలో దున్నపోతు..

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన అక్కల మల్లేశ్ ముర్రాజాతి దున్నపోతు శుక్రవారం విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందింది. రోడ్డుపక్కన మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో మృత్యువాత పడింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

దుకాణాల్లో చోరీ



ఫొటో స్టూడియోను పరిశీలిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఫొటో స్టూడియో, జిరాక్స్‌సెంటర్, లేడీస్ ఎంపోరియం తదితర దుకాణాల్లో వెనుక నుంచి తలుపులు పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు లోనికి చొరబడ్డారు. సుమారు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

అధికారులు కావలెను!

- వ్యవసాయశాఖలో అధికారుల కొరత
- ఒక్కరికే నాలుగు బాధ్యతలు అప్పగింత
- తరచూ సస్పెన్షన్లు, డిప్యూటేషన్లతోనే..
- పర్యవేక్షణ లేక నష్టపోతున్న రైతులు



జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయాధికారుల కొరత ఏర్పడింది. రెండు వ్యవసాయ డివిజన్ (బెల్లంపల్లి, మంచిర్యాల) లకు ఏడీఏగా, డివిజన్ సహాయ వ్యవసాయాధికారిగా, మరోవైపు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి (డీఏవో) జిల్లా వ్యవసాయాధికారిగా ఒక్కరే ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ ముంచుకువస్తోంది. జూన్ 1 నుంచి వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్యాలయ పరిపాలన, సిబ్బందితో పర్యవేక్షించాల్సిన అధికారులు లేకుండా పోయారు. ఆయా డివిజన్ పరిధిలో ముందస్తుగా వానాకాలం సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువులు, రైతులకు పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వినియోగం తదితర సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది. కింది స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే వచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మరో పది రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. జిల్లా వ్యవసాయ కార్యాలయ పారిపాలన, పర్యవేక్షణ విధులు ఏడీఏకు అప్పగించారు. రెగ్యులర్ జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) కల్పన కొంత కాలంగా అనారోగ్యం కారణంగా లీవ్‌లో కొనసాగుతున్నారు. దీంతో బెల్లంపల్లి, మంచిర్యాల ఏడీఏగా కొనసాగుతున్న సురేఖకు ఈ నెల 5న డీఏవోగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో చెన్నూర్, భీమిని, బెల్లంపల్లి, మంచిర్యాల డివిజన్లతో పాటు అదనంగా జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఒక ఏడీఏ మొత్తం ఐదుగురు ఏడీఏలు ఉండాలి. కానీ.. ప్రస్తుతం ఒక్క భీమిని డివిజన్ ఏడీఏ మాత్రమే రెగ్యులర్‌గా ఉన్నారు. 18 మండలాలకు 18 మంది ఏవోలు, జిల్లా కార్యాలయంలో టెక్నికల్, ఇతర విభాగాలకు గాను మరో నలుగురు ఏవోలు ఉండాలి. మొత్తం 22 మందికి గాను ప్రస్తుతం 15 మంది ఏవోలు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. 55 క్లస్టర్లకు 55 ఏఈవోలకు గాను 53 మంది ఏఈవోలు విధుల్లో ఉన్నారు.

సస్పెన్షన్లు.. డిప్యూటేషన్లు..

జిల్లాలో వ్యవసాయశాఖలో కొంత కాలంగా సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. ఏడాది క్రితం చెన్నూర్ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏవో వివిధ ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. బెల్లంపల్లి ఏవోను సరెండర్ చేశారు. మూడు నెలల క్రితం చెన్నూర్ డివిజన్ పరిధిలో ఏడీఏ జాడిబాపు, మరో ఏవోను అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టి వ్యవసాయశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. మరో ఏవో ఉన్నత విద్య కోసం లాంగ్ లీవ్‌లో కొనసాగుతున్నారు. ఇప్పటివరకు ఇద్దరు ఏవోలు, ఒక ఏడీఏ సస్పెన్షన్‌లో ఉన్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో నలుగురు టెక్నికల్ ఏవోలకు గాను ఒక్కరే కొనసాగుతుండగా ఖరీఫ్ సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువులు, ఇతర యాక్షన్ ప్లాన్లు సిద్ధం చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మరో 10రోజుల్లో వానాకాలం..

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ ప్రారంభమవుతోంది. నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో ప్రవేశిస్తుండగా తొలకరి వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకున్నారు. సాగు భూములు చదును చేసుకుని చెత్తాచెదారం కాలబెడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణం చల్లబడడంతో రైతులు గత వానాకాలంలో వేసిన పంట మొదళ్లు తొలగిస్తున్నారు. కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నేపథ్యంలో రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు పంట రుణాల సద్వినియోగం, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వినియోగం, పంట మార్పిడి, యంత్రాల వినియోగం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం, వర్షపాతానికి అనుగుణంగా పంటల సాగు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు విత్తుకోవడం తదితర అంశాలపై వారికి సలహాలు, సూచనలు అవసరం. మరోవైపు రైతులు ఇప్పటికే యాసంగిలో దిగుబడి వచ్చిన పంటలు విక్రయించి పెట్టుబడికి నగదు, విత్తనాలు సమకూర్చుకునే పనుల్లో ఉన్నారు. ఆయా డివిజన్ ఏడీఏలు కార్యాలయాల పరిపాలన, పర్యవేక్షణ పనులు కానరాకపోవడం, ఏవోలు, ఏఈవోలతో సమావేశం నిర్వహించక పోవడంతో రైతులకు ఇబ్బందులెదురయ్యే పరిస్థితి నెలకొంది.

ఇక్కడ జీతం.. అక్కడ విధులు

మంచిర్యాల డివిజన్ ఏడీఏ నిజామాబాద్ జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం (డీఏవో) ఏడీఏ రమేశ్ 2017 నుంచి ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బెల్లంపల్లి, మంచిర్యాల డివిజన్ (ఏడీఏ) కార్యాలయాలకు ఇన్‌చార్జిగా డీఏవోనే కొనసాగుతుండగా, చెన్నూర్ డివిజన్‌కు, జిల్లా కార్యాలయంలో ఏడీఏలు లేక ఏవోలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నెన్నెల, మందమర్రి, చెన్నూర్‌కు ఏవోలు లేక పోవడంతో ఇతర మండలాలకు చెందిన ఏవోలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఏడీఏలు లేక కార్యాలయాల పర్యవేక్షణ, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు లేక పోవడంతో ఇష్టానుసారంగా నడుస్తున్నట్లు తెలుస్తోంది.

నకిలీ విత్తనాలు అరికట్టడమెలా?

ఖరీఫ్‌కు ముందే జిల్లాకు నకిలీ విత్తనాలు చేరుతున్నాయి. ఇప్పటికే ఆయా మండలాల్లో అక్రమవ్యాపారులు రైతులకు చేరవేస్తున్నారు. కలుపు నివారణ సమస్య ఉండదని బీటీ–3 పత్తి విత్తనాలు అంటగడుతున్నారు. దీంతో రైతులు నష్టపోయే ప్రమాదముంది. ఫెర్టిలైజర్ షాపులు తనిఖీ చేసి ఎరువులు, ఇతర విత్తనాలు, పురుగు మందుల వినియోగం గడువు, స్టాక్ వివరాలు చూడాల్సి ఉంటుంది. నకిలీ విత్తనాలు రైతులకు చేరకుండా అడ్డుకట్ట వేసేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. సీజన్ ముందు ఎప్పటికప్పుడు కింది స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించి నిఘా పెంచాలి. రైతులకు పలు సూచలు చేసి గుర్తింపు పొందిన విత్తనాలతో సాగు చేయడం, డీలర్ల వద్ద రశీదు తీసుకోవాలని తదితర సూచనలు చేయాల్సి ఉంది.

రైతులు నష్టపోయే పరిస్థితి

జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్ డివిజన్లు, జిల్లా కార్యాలయంలో ఏడీఏలు లేరు. బెల్లంపల్లి ఏడీఏకు అదనంగా జిల్లా కార్యాలయ బాధ్యతలు అప్పగించారు. దీంతో కార్యాలయ వ్యవస్థ కుంటుపడుతోంది. ఉన్నొక్క రెగ్యులర్ భీమిని డివిజన్ ఏడీఏ కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులకు ఖరీఫ్ సాగుకు ముందస్తు సూచనలు అందడం లేదు. కింది స్థాయి సిబ్బందితో కలిసి రైతువేదికల్లో రైతులకు క్షేత్రస్థాయిలో సమావేశాలు, చైతన్య యాత్రలు నిర్వహించి పంటల మార్పిడి, అధిక దిగుబడితో ఆర్థిక ఎదిగేందుకు చైతన్యం తేవాల్సి ఉంది. లేకుంటే రైతులు మూస పద్ధతిలో వేసిన పంటలు మళ్లీ వేయడం, ఒకరిని చూసి ఒకరు పోటీ పడి ఎరువులు వినియోగించడం, చీడపీడల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టకపోడం, ఇతర సూచనలందక నష్టపోయే పరిస్థితి ఉంది.

ప్రాణహిత మైదానం పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని న్యూనాగార్జున కాలనీ ప్రాణహిత మైదానాన్ని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి శుక్రవారం సివిల్, వర్క్‌షాప్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం అన్ని రంగులతో మైదానాన్ని తీర్చిదిద్ది నట్లు చెప్పారు. ఇందులో బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మైదా నంలో లైటింగ్ ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఇంకా మైదానంలో చేపట్టాల్సిన సివిల్, ఎలక్ట్రికల్ పనుల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన వెంట వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సివిల్ డీజీఎం ఆనందకుమార్, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, వర్క్‌షాప్ ఇంజినీర్ సతీశ్‌చక్రవర్తి, సివిల్ ఈఈ సత్యనారాయణ, సీనియర్ పీవో కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్ ఉన్నారు.

బెల్లంపానకం పారబోత



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

వేమనపల్లి: బుయ్యారం అటవీ ప్రాంతంలోని గుడుంబా తయారీ స్థావరాలపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామానికి వెళ్లారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్లు, పొదల్లో డ్రమ్ములు, బెల్లం పానకం పులియబెట్టి గుడుంబా కాస్తున్నట్లు గుర్తించారు. సుమారు 4,200 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి పారబోశారు. గుడుంబా తయారు చేసే వ్యక్తులంతా బుయ్యారం గ్రామానికి చెందిన వారు కావడంతో అధికారుల రాకను గమనించి పారిపోయారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడి ఆత్మహత్య



ఉమేశ్ (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ఇష్టం లేని వివాహం జరిపించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పెళ్లై నెల కాకుండానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన వడై ఉమేశ్ (27)కు ఈనెల 5న సుర్దాపూర్ గ్రామానికి చెందిన లెంఢ్గురె పోషెట్టి కూతురితో వివాహం జరిపించారు. కాగా, కుటుంబ సభ్యులు గురువారం నవదంపతులకు కార్యం ఏర్పాటు చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉమేశ్ అదేరోజు మధ్యాహ్నం ఇంట్లోని కూలర్ మోటరు మరమ్మతు కోసం ద్విచక్ర వాహనంపై ఆసిఫాబాద్ వెళ్లాడు. కొద్ది సేపటికే తండ్రి బాపురావుకు ఫోన్ చేసి తాను వంకాయ తోటలో ఉన్నానని, బీరు (మద్యం)లో పురుగుల మందు కలిపి తాగినట్లు తెలిపాడు. దీంతో హుటాహుటిన ఉమేశ్ తండ్రి వారి వంకాయ తోటకు వెళ్లి చెట్టు కింద నీరసంగా కూర్చున్న కుమారుడిని ఎందుకిలా చేశావని అడిగాడు. తనకు ఇష్టం లేని వివాహం జరిపించడంతో పురుగుల మందు తాగినట్లు ఉమేశ్ తెలిపాడు. వెంటనే గ్రామస్తుల సాయంతో ఉమేశ్‌ను ఆసిఫాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో పరిస్థితి విషమించి మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బాపురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్ల పట్టివేత



హాజీపూర్ స్టేషన్‌లో టిప్పర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా కంకర తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు శుక్రవారం పట్టుకుని హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి మంచిర్యాలకు శుక్రవారం కంకర తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు తనిఖీ చేశారు. వే బిల్లులు చూపని కారణంగా వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏడీ తెలిపారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువలో ట్రాలీ బోల్తా

- 16మంది ఉపాధి కూలీలకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న దివాకర్‌రావు

దండేపల్లి: మండల కేంద్రం సమీపంలోని కడెం డిస్ట్రిబ్యూటరీ 28 కాలువలో ప్రమాదవశాత్తు టాటా ఏస్ ట్రాలీ శుక్రవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది ఉపాధి కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకాం.. దండేపల్లికి చెందిన ఉపాధి కూలీలు సమీప కడెం ప్రధాన కాలువలో పూడికతీత పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చేందుకు 19 మంది కూలీలు టాటాఏస్ ట్రాలీలో బయల్దేరారు. డిస్ట్రిబ్యూటరీ కాలువ రోడ్డుగుండా కూలీలను తీసుకుని వస్తుండగా ట్రాలీ అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూలీలు వేమునూరి కమల, మోటపల్కుల భాగ్యలక్ష్మి, గోప హేమ, సిరిపురం సువర్ణ, గొట్ల లక్ష్మి, విజయ, పెండ్యాల గంగన్న, వేమునూరి శైలజ, సుకన్య, ముస్కె సునీత, బొమ్మెన సుజాత, బండారి కలవ్వ, అయ్యోరు మహేశ్వరి, ఇమ్మడిశెట్టి లత, స్వప్నకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో బంగారు మల్లవ్వ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి ఎస్సై భూమేశ్ వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కాగా, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు.

టేకుచెట్లు నరికిన వ్యక్తి అరెస్ట్



కోర్టు ప్రాంగణంలో నిందితుడితో సిబ్బంది

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధిలో టేకుచెట్లు, అడవిలోని పొదలు నరికిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎఫ్ వో, ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శివ్‌ఆశిస్‌సింగ్ శుక్రవారం తెలిపారు. తాళ్లపేట్ రేంజ్‌లోని తపాలపూర్ బీట్ కంపార్ట్‌మెంట్ నంబర్ 342లో టేకు చెట్లతో పాటు అక్రమంగా పొదలు నరికినందుకు ఆత్రం చిన్నరా జంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పే ర్కొన్నారు. లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి నింది తుడికి 14రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట: హన్మకొండ జిల్లా నడికుడకు చెందిన దేవేందర్ (33) కూలీ పనుల కోసం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు వెళ్తూ జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 5.30గంటల సమయంలో హన్మకొండ జిల్లాకు చెందిన జగన్నాథుల దేవేందర్, తుంగపిండి రమేశ్‌ను సంగారెడ్డి జిల్లాకు చెందిన మంగళిప్రసాద్ తన వ్యాన్‌లో కూలీ పనుల కోసం రెబ్బెనకు తీసుకువెళ్తున్నాడు. సోమవారం ఉదయం రహదారిపై సోమగూడెం బైపాస్ రోడ్డు వద్ద మధుర హోటల్ సమీపంలో వ్యాన్‌ను అతివేగంగా ఆ జాగ్రత్తగా నడిపి గుర్తు తెలియని లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ దేవేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్ ఎ డమ చెంప, ఎడమ కాలికి గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు

వాంకిడి: కర్రతో దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం లెండిగూడ గ్రామానికి చెందిన గుర్నులె సోమకు ఇద్దరు కుమారులు నాందేవ్, మనోహర్ ఉన్నారు. సోమ ఏడాది క్రితం మృతి చెందగా అతడి పేరిట ఉన్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరు సమంగా సాగు చేసుకుంటున్నారు. అయితే తల్లి బాగోగులు చిన్న కుమారుడు మనోహర్ చూసుకుంటున్నందున వాటాలో ఐదు మూరలు అధికంగా తమ్ముడు సాగు చేసుకునేందుకు నాందేవ్ అంగీకరించాడు. ఈ క్రమంలో గురువారం తమ్ముడి ఇంటికి వెళ్లిన నాందేవ్.. తల్లికి జ్వరం వస్తున్నా ఆస్పత్రిలో ఎందుకు చూపించడం లేదని అడిగాడు. దీంతో ఆవేశానికి గురైన మనోహర్ 'భూమి పంచుకుందాం అంటే పట్టించుకోకుండా ఎందుకు మాట్లాడుతున్నావు' అని బూతులు తిడుతూ కర్రతో అన్న తలపై కొట్టాడు. పక్కనే ఉన్న మనోహర్ భార్య తానుబాయి, కుమారుడు శ్రీకాంత్ కూడా నాందేవ్‌పై దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు వారిని విడిపించడంతో గొడవ సద్దుమణిగింది. నాందేవ్ తలపై రక్తపు గాయాలు కాగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. శుక్రవారం నాందేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనాథ బాలిక ఆశ్రమానికి తరలింపు

చింతలమానెపల్లి: బాబాసాగర్ గ్రా మానికి చెందిన కీర్తి అనే అనాథ బాలికను శుక్రవా రం మంచిర్యాల ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమానికి తరలించారు. కీర్తి ఐదేళ్ల క్రితం తల్లిదండ్రులను కోల్పోయింది. పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. బాలిక పరిస్థితిని స్థానిక సామాజిక కార్యకర్తలు చప్పిడి ప్రకాశ్, సిద్దం పెంటయ్య మంచిర్యాలలోని కల్పరి యువశక్తి అనాథ ఆశ్రమ నిర్వాహకులకు తెలిపారు. దీంతో స్పందించిన ఆశ్రమ నిర్వాహకుడు కుమార్ గ్రా మానికి చేరుకున్నారు. ఏఎస్సై యాదవ్, గ్రామ పెద్దలు కత్తర్ల భీమేశ్, నాగపురి మోహన్ సమక్షంలో బాలికను ఆశ్రమ నిర్వాహకుడు కుమార్‌కు అప్పగించారు. గ్రామస్తులు ఆశ్రమ నిర్వాహకుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

ఆసిఫాబాద్‌రూరల్: ప్రియుడితో కలిసి భర్తను భార్య చంపిన ఘటన మండలంలోని రహపల్లిలో చోటు చేసుకుంది. మృతుడి అన్న ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. తన తమ్ముడు చునార్కర్ రవీందర్ (38) భార్య కళావతి గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌తో తరచూ ఫోన్‌లో మాట్లాడేదని ఆనందరావు తెలిపాడు. దీంతో ఇంట్లో గొడవలు పెరిగాయని, గతంలోనూ పంచాయితీ జరిగినట్లు పేర్కొన్నాడు. గురువారం కూడా గొడవ జరిగిందని, ఈక్రమంలో తన తమ్ముడు రవీందర్‌ను ప్రియుడితో కలిసి కళావతి ఇంట్లో ఉరేసి చంపిందని వివరించాడు. కళావతి, రవీందర్‌పై ఆనందరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

నిత్యం వ్యాయామం చేయాలి

శ్రీరాంపూర్: నిత్యం వ్యాయామం, వాకింగ్ చేస్తే బీపీకి దూరంగా ఉండవచ్చని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం సింగరేణి ఆధ్వర్యంలో నస్పూర్ డిస్పెన్సరీలో అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తపోటు ప్రమాదకరమని, సరైన ఆహార నియమాలు పాటించాలని, ఒత్తిడి తగ్గించుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే దీనికి దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఇటీవల గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తంజేశారు. అప్పుడప్పుడు బీపీ చెక్ చేసుకుని వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పర్యావరణ కాలుష్యంతో మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం కలుషితమవుతుందని, ఈ ప్రభావం ఆరోగ్యంపై పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన వారికి జీఎం చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్, వైద్యుడు మురళీధర్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్ పీహెచ్‌సీలో..

నస్పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖ అధికారి ఎస్.అనిత హాజరై రక్తపోటు రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన చికిత్స గురించి వివరించారు. సరైన జీవనశైలి, ఆహార అలవాట్లతో రక్తపోటుకు దూరంగా ఉండవచ్చని వివరించారు. వైద్యులు నీరజ, శివప్రతాప్, కిరణ్, సమత తదితరులున్నారు.


కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

బెల్లంపల్లి: కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి సబ్బని సాంబయ్య పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎర్రజెండా పార్టీలను ఏకం చేయడానికి తమ పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంసీపీఐ (యూ) జిల్లా మాజీ సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేశ్ తిరిగి ఎర్ర కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌కు సాంబయ్య ఎర్రకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గం లక్ష్మి, నాయకులు కామెర పద్మ, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్‌అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: 2024–25 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఉపసంచాలకుడు రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో నాన్ రెసిడెన్షియల్, ఐదో తరగతిలో రెసిడెన్షియల్ ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 91 సీట్లు, ఐదో తరగతిలో 92 సీట్లు కేటాయించామని తెలిపారు. ఆసక్తిగలవారు మీసేవా ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణప్రాంతాల వారికి రూ.2లక్షలు మించరాదని తెలిపారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్ మీ సేవా ద్వారా జారీ చేసి ఉండాలని పేర్కొన్నారు. ఒకటో తరగతి కోసం తేదీ: 01.06.2018 నుంచి తేదీ: 31.05.2019 లోపు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం నాలుగో తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. మార్కుల జాబితా, బోనఫైడ్ సర్టిఫికెట్ దరఖాస్తుతోపాటు జత చేయాలని తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల18 నుంచి జూన్ 7వ తేదీ వరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పూర్తి వివరాలకు 9441333348 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల ఎంపిక జూన్ 11న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిన ఉంటుందని తెలిపారు. డే స్కాలర్‌గా ఎంపికై బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో చదివే విద్యార్థులు ఐదో తరగతి రెసిడెన్షియల్ పథకం కోసం దరఖాస్తు చేసుకోరాదని పేర్కొన్నారు.

పని ఒత్తిడికి ఇంజినీర్ బలి!



కిరీటి (ఫైల్)

జైపూర్: జైపూర్ సింగరేణి పవర్ ప్లాంట్‌లో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బూరుగడ్డ కిరీటి (37) అనే సింగరేణి ఉద్యోగి తన క్వార్టర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని టీచర్స్ కాలనీకి చెందిన కిరీటి ప్లాంట్‌లో ఓఅండ్‌ఎం (బాయిలర్లలో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణకు సంబంధించిన) డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ సెక్షన్ ఇంజినీర్ (ఎస్ఈ)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు ప్లాంట్‌లో క్వార్టర్ కేటాయించగా భార్య శృతి, మూడేళ్ల కుమారుడు క్రితిక్‌తో కలిసి నివాసముంటున్నాడు. శృతి వేసవి సెలవుల్లో కుమారుడితో పుట్టింటికి వెళ్లింది. కిరీటి గురువారం ఉదయం గోదావరిఖనిలో తన ఇంటి నుంచి పవర్‌ప్లాంట్‌కు డ్యూటీకి వచ్చాడు. శుక్రవారం కూడా విధులకు హాజరై మధ్యాహ్నం భోజన సమయంలో క్వార్టర్‌కు వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా సాయంత్రం విషయం వెలుగులోకి వచ్చింది. ఒంటరిగా క్వార్టర్‌లో ఉన్న కిరీటి ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కిరీటి తల్లిదండ్రులు అన్నపూర్ణ–రఘురామాచారి అధికారుల పని ఒత్తిళ్లతోనే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే కిరీటి హఠాత్తుగా ఆత్మహత్యకు పాల్పడగా అంతా కన్నీరు పెట్టుకున్నారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, ఫ్యామిలీకి సమయం ఇవ్వలేక, పని ఒత్తిడి తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కిరీటి సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం.